



• మానాల గ్రామం



• మహిళా స్మారక స్థూపం

మానాల ఎన్‌కౌంటర్‌కు 19 ఏళ్లు

- బోడ గుట్టపై 2005 మార్చి 7న భారీ ఎన్‌కౌంటర్
- నాటి నుంచి తెరమరుగైన మావోలు.. అభివృద్ధివైపు గ్రామాలు
- నాడు పూరి గుడిసెలు.. నేడు అద్దాలమేడలు
- అందుబాటులోకి వచ్చిన సకల సదుపాయాలు
- స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్న గ్రామస్థులు

కమ్మర్‌పల్లి, మార్చి 6: రెండు జిల్లాల సరిహద్దు లోని అటవీ ప్రాంతం, మారుమూల గిరిజన గ్రామం మానాలలో ఒక్కప్పుడు ఏది జరిగినా.. అది సంచలనమే. అలాంటి మానాల గ్రామంలో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన భారీ ఎన్‌కౌటర్ జరిగి నేటికీ పంతొమ్మిదేళ్లు పూర్తయ్యాయి. గతంలో ఈ గ్రామం పూర్తిగా మావోలకు పెట్టని కోటలాగుండేది. మానాల గ్రామస్థుల సహకారం ఉండడంతో ఈ ప్రాంతంలో కేంద్రస్థాయి మావో నాయకులు నడయాడిన సందర్భాలు ఉన్నాయి. 1990లో ఏకంగా మానాల అటవీ ప్రాంతంలో అప్పటి నిషిద్ధ పీపుల్స్ వార్ సాయుధ శిక్షణ శిబిరాలను నిర్వహించినట్లుగా, భారీ యంత్రాలతో ఆయుధాల తయారీ కేంద్రాన్ని కొనసాగించినట్లు చెబుతారు. మానాల గ్రామానికి అధికారులు వెళ్లాలంటే గజగజ వణికి పోయేవారు. పోలీసులది సైతం అదే పరిస్థితి ఉండేది. గ్రామస్థులు మాత్రం మావోలను కడుపులో పెట్టుకుని కాపాడిన సందర్భాలు ఉన్నాయి. అందుకు ఫలితంగా మావోలు గ్రామస్థుల సహకారంతో గతంలో రుద్రంగి సరిహద్దు నుంచి మానాల గ్రామం వరకు భారీ ఖర్చుతో రహదారి పనులు చేపట్టారు.

ఐదేళ్లపాటు నాన్ గవర్నమెంట్ పాలన

1995లో జరిగిన సర్పంచ్ ఎన్నికలను బహిష్కరిస్తూ నామినేషన్లు వేయకపోవడంతో ఐదేళ్లపాటు ఈ గ్రామంలో సర్పంచ్ లేక వారు నియమించిన వ్యక్తి ద్వారా నాన్ గవర్నమెంట్ పాలన సాగింది. అంతకు ముందు గ్రామంలో నక్సలైట్లు వారం రోజులు మానాల గ్రామాన్ని దిగ్బంధించి ఆసియా ఖండంలోనే రెండోదిగా చెప్పబడే 47 అడుగుల ఎత్తుతో 18 మంది మహిళా నక్సలైట్ల స్మారక స్థూపాన్ని నిర్మించారు. ఈ స్థూపం భారీ ఎన్ కౌంటర్‌కు మూగ సాక్షిగా ఇప్పటికీ గ్రామంలో దర్శనమిస్తుంది. అలాంటి పట్టున్న మానాల గ్రామంలో 2001 జూన్ 13 ఉత్తర తెలంగాణ స్పెషల్ జోన్ కమిటీ సభ్యుడు ఆజాద్ ఆధ్వర్యంలో పీపుల్స్‌వార్ దళ సభ్యులు పది మంది గిరిజనులను కోవర్టుల పేరిట కాల్చి చంపారు. అందులో మానాల గ్రామానికి చెందిన ఒకరు కాగా, తండాలకు చెందిన నలుగురు గిరిజనులున్నారు. ఈ కోవర్టు హత్యలతో కలత చెందిన మానాల వాసులకు, మావోలకు మధ్య దూరం పెరుగుతూ వచ్చింది.


ఎన్‌కౌంటర్‌తో ఉనికి కోల్పోయిన మావోలు

మావోలకు కంచుకోటగా వెలుగొందిన మానాల జీపీ పరిధిలోని జోద్యానాయక్ తండా సమీపంలోని బోడ గుట్టపై 2005 మార్చి7న జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌తో దేశవ్యాప్త సంచలనానికి మరుపేరుగా నిలిచింది ఈ ఎన్‌కౌంటర్‌లో నిజామాబాద్, అప్పటి కరీంనగర్ (ప్రస్తుతం రాజన్నసిరిసిల్ల జిల్లా) పశ్చిమ డివిజన్ కార్యదర్శి గంగుల వెంకటస్వామి (రమేష్) జిల్లా కమిటీ సభ్యుడు కొమ్మబాబు (బాబన్న)తో పాటు మరో ఎనిమిది మంది మావోయిస్టు సభ్యులు ఎన్‌కౌంటర్లో మృతి చెందడంతో మావోల ఉనికి లేకుండా పోయింది. ఈ ఎన్‌కౌంటర్‌కు ప్రధాన కారణంగా గుర్తించిన మావోలు దళసభ్యురాలు పద్మను కొంతకాలం తర్వాత మరిమడ్ల గ్రామ శివారుల్లో కాల్చి చంపారు. అప్పటి వరకు గ్రామంలో ఎలాంటి అభివృద్ధి లేక అటు నక్సలైట్లు, ఇటు పోలీసుల బూట్ల చప్పుళ్లతో బిక్కుబిక్కుమంటూ గ్రామస్థులు, గిరిజనులు కాలం గడిపారు. పందొమ్మిదేళ్ల క్రితం జరిగిన భారీ ఎన్‌కౌంటర్ అనంతరం ఇరు పక్షాల అలజడి తగ్గడంతో స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నారు. ప్రస్తుతం ఈ గ్రామం ఒక్కొక్క అడుగుగా అభివృద్ధి పథంలో వెళ్తుంది. గ్రామంలో నాడు పూరిగుడిసెల స్థానంలో అద్దాల మేడలు దర్శనమిస్తున్నాయి. ఎన్నికలంటే జంకిన జనాలు నేడు నిర్భయంగా పోటీకిసై అంటున్నారు.



నాడు భారీ ఎన్‌కౌంటర్ జరిగిన బోడగుట్ట ప్రాంతం ఇదే..

తప్పుల తడకగా గణితం-1బీ



19. Show that the lines represented by $(lx+my)^2 - 3(mx-ly)^2 = 0$ and $lx + my + n = 0$ form an equilateral triangle with area $\frac{n^2}{\sqrt{3}(l^2+m^2)}$ sq. units.
20. Find the condition for the chord $lx + my = 1$ of the circle $x^2 + y^2 = a^2$ (whose centre is the origin) to subtend a right angle at the origin.
21. Find the angle between the lines whose direction cosines are given by the equations $3l+m+5n = 0$ and $6mn-2nl+5lm = 0$.
22. If $y = x\sqrt{a^2+x^2} + a^2\log(x+\sqrt{a^2+x^2})$, then show that $\frac{dy}{dx} = 2\sqrt{a^2+x^2}$.
23. If the tangent at any point on the curve $x^{\frac{2}{3}} + y^{\frac{2}{3}} = a^{\frac{2}{3}}$

తప్పిదాలతో ఇంటర్ ప్రశ్నా పత్రం ఇలా..

- ఇంటర్ ఫస్టియర్ పరీక్షల్లో సిలబస్‌లో లేని ప్రశ్నలు
- పరీక్షా కేంద్రంలో ఇబ్బందులు పడ్డ విద్యార్థులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

నిజామాబాద్ అర్బన్, మార్చి 6: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో భాగంగా బుధవారం నిర్వహించిన గణితం-1 బీ పేపర్ తప్పుల తడకగా రావడంతో.. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సిలబస్‌లో లేని ప్రశ్నలు ఇవ్వడంతో పాటు సంబంధం లేని ప్రశ్నలతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. పరీక్షా పేపర్‌లో 19, 20, 21 ప్రశ్నల్లో అక్షర దోషాలతో విద్యార్థులు అయోమయానికి గురయ్యారు. ఎల్ ఎక్స్‌కు బదులుగా వన్ ఎక్స్, ఎల్ స్థానంలో వన్ ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. అలాగే 21వ ప్రశ్నలో 3ఎల్‌కు బదులుగా 31 రావడంతో ప్రశ్న పూర్తిగా మారిపోయింది. విద్యార్థులు పరీక్ష ముగిసిన అనంతరం ప్రశ్నపత్రం తప్పుగా వచ్చినట్లు గుర్తించారు. గతంలో ఎన్నడూలేని విధంగా ప్రశ్నాపత్రం కఠినంగా రావడంతో విద్యార్థులు ఆందోళన చెందారు. ప్రశ్నపత్రం తప్పుగా ఇవ్వడంతో ఇంటర్ బోర్డు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఈ విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని విద్యార్థులు ఎదురు చూస్తున్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ లబ్ధిదారులపై రూ.20 కోట్ల భారం!





బాల్కొండలో ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

- అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్
- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ముప్కాల్, మార్చి 6 : కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రంలోని 25లక్షల ఎల్‌ఆర్‌ఎస్ లబ్ధిదారులపై రూ.20కోట్ల భారం పడుతుందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా బుధవారం బాల్కొండలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. అబద్ధపు హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తానని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఉచిత బస్సు ప్రయాణంతో గొడవలు పెడుతున్నార న్నారు. మూడు నెలలు గడుస్తున్నా.. ఇప్పటికీ రైతులకు రైతు బంధు లేదని, చేయూత పెన్షన్ మరిచి మహాలక్ష్మీ ఊసే ఎత్తడం లేదన్నారు. కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీని బొంద పెడతానన్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలే బొంద పెట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ పేరుతో ఒక్కో ప్లాట్‌పై లక్ష చొప్పున రాబట్టేందుకు ప్రణాళిక చేసిందని ఆరోపించారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఎల్‌ఆర్‌ఎస్ అమలుపై నానాయాగి చేసిన కాంగ్రెస్.. అప్పట్లో చేసిన ఉచిత హామీ ఏమైందని ప్రశ్నించారు. ఉచిత ఎల్‌ఆర్‌ఎస్ వర్తించే వరకు పోరాటం ఆపేది లేదని హెచ్చరించారు. లేకుంటే సీఎం రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సీతక్క, కోమట్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క రాజీనామా చేయాలన్నారు. కార్యకర్తలపై అక్రమ కేసులతో ఇబ్బందిపెడితే తగిన గుణపాఠం చెబుతామని పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ధర్నా స్థలం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీగా ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీన్‌రెడ్డి, ముస్కు భూమేశ్వర్, నాగంపేట్ శేఖర్, సామ వెంకట్‌రెడ్డి, బద్దం నర్సారెడ్డి నా [illegible] పాల్గొన్నారు.

క్వింటా పసుపు రూ.15,825



• నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో పసుపునకు అత్యధిక ధర

నిజామాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో పసుపునకు రోజురోజుకూ ధర పెరుగుతోంది. బుధవారం బాల్కొండ మండలం వన్నెల్ (బి) గ్రామానికి చెందిన మహిళా రైతు సునీత మార్కెట్‌కు 9క్వింటాళ్ల పసుపును తీసుకు రాగా.. క్వింటాకు అత్యధికంగా 15,825 రూపాయల ధర పలికింది. పదేళ్లలో ఇంత ఎక్కువ ధర ఎప్పుడూ రాలేదు. మార్కెట్‌కు బుధవారం 6500 క్వింటాళ్ల పసుపు రాగా.. ఒక రైతుకు సంబంధించిన పసుపునకు మాత్రమే ఈ ధర వచ్చింది. మార్కెట్‌లో సరాసరి క్వింటాలు రూ.8వేల నుంచి రూ.14,500 మధ్యలో అమ్మకాలు జరుగుతున్నాయి.

ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సర్కారు శ్రీకారం

- నియోజకవర్గానికి 3500 ఇళ్లు
- ఈనెల 11న పథకం ప్రారంభం
- గ్రామసభల్లో అర్హుల ఎంపిక
- డబుల్‌బెడ్ రూం ఇళ్ల పంపిణీపై స్పష్టత కరువు



నిజామాబాద్, మార్చి 6: (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుడుతుండగా జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులూ లేవు.. వాటిని పట్టించుకునేవారు లేరు. ఇళ్ల నిర్మాణం పూర్తయి ఆరేళ్లు గడుస్తున్నా పేదలకు కేటాయింపులు చేయడం లేదు. అర్హుల ఎంపిక కోసం అధికారుల ఆధ్వర్యంలో కసరత్తు చేసి జాబితా సిద్ధం చేసినా అప్పటి రాజకీయ నేతలు పట్టించుకోలేదు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గానికి 3500 ఇళ్లను కేటాయించి ఈనెల 11న పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాచలంలో అధికారికంగా సీఎం ప్రారంభించనున్నారు. అదేరోజు జిల్లాలో కూడా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. తెల్లరేషన్ కార్డు ఉండి, సొంత స్థలం ఉన్న వారిని మొదటి విడతలో ఎంపిక చేసేందుకు నిర్ణయించారు. గ్రామస్థాయిలో దరఖాస్తులను పరిశీలించి సభల ద్వారా అర్హులను ఎంపిక చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఎనిమిదేళ్ల క్రితం డబుల్‌బెడ్ రూం పథకం

గత ప్రభుత్వ హయాంలో ఎనిమిదేళ్ల క్రితం డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణం చేపట్టారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు ఇళ్లను మంజూరు చేశారు. ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. ఆరు నియోజకవర్గాల్లో 15304 ఇళ్లను మంజూరుచేయగా, 9772 ఇళ్లకు టెండర్లు పూర్తయ్యాయి. ఈ ఎనిమిదేళ్ల కాలంలో 6162 ఇళ్లు పూర్తయ్యాయి. వీటిలో 3 వేల ఇళ్లు బాన్సువాడ నియోజకవర్గం పరిధిలోని నిర్మాణమయ్యాయి. ఈ నియోజకవర్గంలో నిర్మించిన ఇళ్లను అర్హులకు కేటాయించగా మిగతా నియోజకవర్గాలలో నిర్మించిన ఇళ్లలో సగం వరకే కేటాయింపులు చేశారు. నిజామాబాద్ అర్బన్ పరిధిలో 648 ఇళ్లు నాగారంలో పూర్తయి ఆరేళ్లు గడిచినా.. ఎవరికీ కేటాయింపులు చేయలేదు. ఇవేకాకుండా కొత్త కలెక్టరేట్ వద్ద ఇళ్ల నిర్మాణం పూర్తయినా ఇంకా ఎవరికీ కేటాయించలేదు. మిగతా నియోజకవర్గాల్లో కూడా కొన్ని ఇళ్ల నిర్మాణం పూర్తయినా ఎన్నికల సమయంలో నిలిపివేశారు. జిల్లాలో ప్రస్తుతం నిర్మాణం పూర్తి చేసుకున్న ఇళ్లు 1500కు పైగా ఉన్నాయి. వాటిపై ఇప్పటివరకు కొత్త ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. గత ప్రభుత్వం హయాంలో ఏళ్లు గడిచినా ఎవ్వరికీ కేటాయించకపోవడంతో అవి దెబ్బతింటున్నాయి. అందులోని ఫర్నిచర్, కిటికీలు, తలుపులు దొంగిలించుకెళుతున్నారు. అసాంఘిక కార్యక్రమాలకు నెలవుగా మారుతున్నా పట్టించుకోవడం లేదు. కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు పట్టించుకొని ఇళ్లను త్వరితగతిన పేదలకు కేటాయించాలని పలు సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని శ్రీకారం

డబుల్‌బెడ్ రూం పథకానికి స్వస్తి చెప్పి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేసేందుకు రేవంత్ సర్కారు శ్రీకారం చుట్టింది. ఈ నెల 11న ఈ పథకాన్ని భద్రాచలంలో ప్రారంభిస్తున్నారు. అదే రోజు అన్ని జిల్లాల్లో స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా ఈ పథకం ప్రారంభిస్తున్నారు. ఈ పథకం కింద ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షలను ఇవ్వనున్నారు. సొంత ఇళ్ల స్థలాలున్నవారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వారికే నేరుగా ఇళ్ల కేటాయింపును చేయనున్నారు. ప్రతి నియోజకవర్గానికి ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరంలో 3500 ఇళ్లను కేటాయించారు. నియోజకవర్గంలోని ఇళ్లులేని నిరుపేదలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్నవారి వివరాల ఆధారంగా వీటిని కేటాయించనున్నారు. తెల్ల రేషన్‌కార్డులు ఉన్నవారికే ఇళ్లను మంజూరు చేస్తారు. మొదట విడత పూర్తయిన తర్వాత వచ్చే ఆర్థిక సంవత్సరంలో రెండో విడత ఇళ్ల స్థలాలతోపాటు ఇందిరమ్మ ఇళ్లను పేదలకు కేటాయింపు చేయనున్నారు. ఇందిరమ్మ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించడంతోపాటు గ్రామస్థాయిలో సభలను నిర్వహించి దరఖాస్తుల పరిశీలన చేసి అర్హులను ఎంపిక చేయనున్నారు. ఈ ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రత్యేక కమిటీలను కూడా గ్రామ స్థాయిలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. ఇదే రీతిలో మున్సిపాలిటీల్లోని వార్డుల్లో సభలను నిర్వహించి ఎంపిక చేయనున్నారు. జిల్లా స్థాయిలో ఇప్పటికే సమీక్షించిన కలెక్టర్ ప్రభుత్వం ఇచ్చే నిబంధనలను అనుసరించి ప్రత్యేక అధికారులను నియమించనున్నారు. వారి ఆధ్వర్యంలోనే సభలు నిర్వహించి అర్హులను ఎంపిక చేయనున్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ పథకం ప్రారంభించడంతోపాటు నిర్మాణమైన డబుల్ బెడ్‌రూం ఇళ్లను పేదలకు కేటాయిస్తే వందలాది మందికి ఇళ్లు అందే అవకాశం ఉంది.

డిగ్రీ విద్యార్థి ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరం

● వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కమిషనర్

బోధన్ రూరల్, మార్చి 6:బోధన్ పట్టణంలోని బీసీ హాస్టల్‌లో సోమవారం కామారెడ్డి జిల్లా గాంధారి మండలం తిప్పారం తండాకు చెందిన హరిప్పా బస్సీవెంకట్ (20)అనే డిగ్రీవిద్యార్థి ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కమిషనర్ ఒకప్రకటనలో తెలిపారు. వసతిగృహంలో జరిగిన సంఘటనతో తక్షణమే బీసీ వసతి గృహం వార్డెన్ స్వామిని సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. వాచ్‌మెన్ గంగాధర్‌ను విధుల నుంచి తొలగించడం జరిగిందన్నారు. వెంకట్ సోదరుడు మల్కన్‌కు వెంటనే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సంఘటన కేవలం బీసీ వసతి గృహాలకు మాత్రమే సంబంధించిందని విద్యాశాఖతో ఈ సంఘటనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన వివరించారు. బీసీ వసతి గృహాల్లో చదువుకుంటున్న పిల్లల భద్రతకు కావాల్సిన అన్ని చర్యలను తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలోని అన్ని బీసీ వసతి గృహాల్లో చదువుకుంటున్న పిల్లలు, వారి తల్లిదండ్రులుగాని ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం ఉందన్నారు. ఇది పరీక్షల సమయం కాబట్టి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారి సంపూర్ణ భద్రత కోసం బీసీ సంక్షేమ అధికారులు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్నాయని, వీటికి ఎక్కడ ఎలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా నిర్వహిస్తున్నామన్నారు. ఇలాంటి సంఘటనలు పునరా వృత్తం కాకుండా మరెక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగ కుండా పూర్తి జాగ్రత్తలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

శివరాత్రికి వేములవాడకు ప్రత్యేక బస్సులు

పెర్కిట్, మార్చి6: మహాశివరాత్రి సందర్భంగా ఆర్మూర్ నుంచి వేములవాడకు ప్రత్యేక బస్సులు నడపుతున్నట్టు డిపోమేనేజర్ ఆంజనేయులు తెలిపారు. గురువారం నుంచి శనివారం వరకు బస్సు నడుపుతున్నామని ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ప్రజలకు అన్ని విధాల అందుబాటులో ఉంటా

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



ఎల్‌వోసీ అందజేస్తున్నఎమ్మెల్యే ధన్‌పాల్‌సూర్యనారాయణ

పెద్దబజార్,మార్చి 6:నగర ప్రజలకు అన్ని విధాలుగా అందుబాటులో ఉండి వారి అవసరాలను తీర్చడానికి ముందుంటానని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌సూర్యనారాయణ అన్నారు. బుధవారం నగరంలోని అర్బన్ ఎమ్మెల్యే కార్యాలయంలో అనారోగ్యంతో బాధప డుతున్న ప్రశాంత్‌కు ఆర్థిక సహాయంగా రూ.3లక్షల ఎల్‌వోసీ అందజేశారు. ఆయన మాట్లాడుతూ గాజుల్‌పేట్‌కు చెందిన సునీత, ప్రశాంత్‌కు కిడ్నీలు చెడిపోయి ఆరోగ్యం బాగలేనందున వెంటనే స్పందించి ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు.

సొసైటీ సొమ్మును రికవరీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

నిజామాబాద్‌రూరల్,మార్చి 5: నిజామాబాద్ సొసైటీలో పనిచేస్తున్న మాజీ సిబ్బంది రైతుల నుంచి వసూలు చేసిన రూ. 87,36,752 అవకతవకలకు పాల్పడినట్లు అధికారులు తెలి పారు. బుధవారం కోటగల్లీలోని కార్యాలయంలో మహాజన సభ నిర్వహించారు. ఈ సభకు బ్యాంక్ అధికారులు, జిల్లా సొసైటీ అధికారులు పాల్గొని డీసీవో నివేదిక చదివి వినిపించారు. సొసైటీలో జరిగిన అవకతకవకల వివరాలు.. నిజామాబాద్ సొసైటీలోని సభ్యులు తీసుకున్న స్వల్పకాల, దీర్ఘకాల రుణాలను రైతులు అప్పటి సొసైటీ కార్యదర్శి శివరామరాజు, క్యాషియర్ భాస్కర్‌లకు చెల్లించారు. వారు తాత్కాలిక రశీదులిచ్చి రైతుల ఖాతాలో జమచేయకుండా తమ స్వంతానికి వాడుకున్నారు. రైతుల ఫిర్యాదుతో అవకతవకలు వెలుగుచూశాయి. చైర్మన్ అప్పటి డీసీవో సింహాచలంకు ఫిర్యాద చేయడంతో విచారణ చేపట్టారు. ప్రస్తుత డీసీవో శ్రీనివాసరావు నివేదిక ఇచ్చారు. నిజామాబాద్ సొసైటలో మొత్తం రూ.87,36,752 అవకతవకలు జరిగాయని నిర్ధారించారు. శివరామరాజు రూ.5146,137, భాస్కర్ రూ. 35,77,116లు సొసైటీకి బాకీ పడ్డారని తేల్చారు. సస్పెన్షన్‌లో ఉన్న వీరి వద్ద నుంచి సొమ్ము రికవరీ చేయాలని మహాజన సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. మరో ఇద్దరు రైతులు కూడా తాము మోసపోయామని చైర్మన్ శేకర్‌కు ఫిర్యాదు చేయడం కొసమెరుపు

భట్టివిక్రమార్కను కలిసిన తాహెర్‌బిన్ హందాన్



బట్టివిక్రమార్కను కలిసిన తాహెర్‌బిన్‌హందాన్

నిజామాబాద్‌అర్బన్,మార్చి 6 :రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా పదవి బాద్యతలు స్వీకరించిన జిల్లాకు చెందిన తాహెర్‌బిన్‌హందాన్ బుధవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన నియామకానికి కృషి చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆయనతో పాటు రాష్ట్ర కిసాన్‌కాంగ్రెస్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, గంగారెడ్డి, సంతోష్, ఉన్నారు.

గుర్తుతెలియని కారు ఢీకొని ఒకరి మృతి

జక్రాన్‌పల్లి, మార్చి6: మండలంలోని అర్గుల్ గ్రామంలో 44వ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి గుర్తు తెలియని కారు ఢీకొని నందిపేట మండలం నూత్‌పల్లి గ్రామానికి చెందిన కనూరి గంగాధర్(35) అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రాత్రిగంగాధర్ రోడ్డు వెంట నడుచుకుంటూ వస్తుండగా ఆర్మూర్ నుంచి డిచ్‌పల్లి వైపు వెళ్తున్న గుర్తు తెలియిన కారు వెనుక నుంచి వచ్చి ఢీకొందని ఈ ప్రమాదంలో కనూరి గంగాధర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య స్వాతి ఇచ్చిన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై తెలిపారు.

ఆర్మూర్ ఆర్డీవోగా రాజాగౌడ్ బాధ్యతలు

ఆర్మూర్‌రూరల్, మార్చి6: ఆర్మూర్ రెవెన్యూ డివిజన్ అధికారిగా రాజాగౌడ్ బుధవారం బాధ్య తలు స్వీకరించారు. ఇటీవలి వరకు ఆర్మూర్ ఆర్డీవోగా పని చేసిన వినోద్ కుమార్ బదిలీపై భూపాలపల్లి జిల్లాకు వెళ్లగా ఆయన స్థానంలో ఆర్మూర్ ఆర్డీవోగా బోధన్ నుంచి రాజాగౌడ్ బదిలీ పై వచ్చారు. నూతన ఆర్డీవో రాజాగౌడ్‌కు కార్యా లయ సిబ్బంది, అధికారులు పుష్ప గుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

మిట్టపల్లి బ్యాంకులో మహిళా దినోత్సవం

డిచ్‌పల్లి, మార్చ్ 6: మిట్టపల్లి బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకులో బుధవారం సాయంత్రం అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా బ్యాంకు సిబ్బంది మహిళ సంఘాల ప్రతినిధులతో కలిసి సంబరాలు నిర్వహించుకున్నారు. కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

'బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తు తనకెలాంటి సంబంధం లేదు'

బోధన్‌రూరల్, మార్చి 6: బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తు పరిణామాలపై తనకెటువంటి సంబంధం లేదని పెంటా ఖుర్దు సహకార సంఘం చైర్మన్, బీఎస్పీ బోధన్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన అమర్‌నాథ్‌బాబు అన్నారు. బుధవారం బోధన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 45 సంవత్సరాల తన రాజకీయ జీవితంలో ప్రజల కోసం ఎన్నో అభివృద్ధి పనులు చేశానన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొందరు తనపై దుష్ప్రచారాలు చేశారని ఆయన పేర్కొన్నారు. బోధన్ నియోజకవర్గానికి జేఎన్‌టీయూసీ కళాశాల తీసుకురావాలన్నారు.హెగ్డేవార్ జన్మస్థలమైన కందకుర్తిని కేంద్ర ప్రభుత్వం మరింత అభివృద్ధి చేయాలన్నారు. బోధన్ నియోజక వర్గాన్ని సీఎం అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఇటీవల సాలూరకు వచ్చిన విషయాన్ని బీఎస్పీ జిల్లాఇన్‌చార్జి తనకుసమాచారం అందించక పోవడం విచారకరమన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా చేపట్టాలి

- ఇచ్చిన హామీలను ఆరుగ్యారెంటీలను వెంటనే అమలు చేయాలి
- కాంగ్రెస్ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు
- నగర మేయర్ దండునీతుకిరణ్



ధర్నా చేస్తున్న దృశ్యం

ఖిల్లా,మార్చి 6:కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా చేట్టాలని నగర మేయర్ దండునీతుకిరణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో బుధవారం బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ ఆదేశాల మేరకు ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు. ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేపట్టాలని, రాష్ట్రంలో 25.44లక్షల మంది ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు దారుల నుంచి రూ.20వేల కోట్లను వసూలు చేసేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతుందన్నారు. కాంగ్రెస్ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టీ విక్రమార్క, సీతక్క. ఎల్‌ఆర్‌ఎస్ డబ్బులు కట్టవద్దని కాంగ్రెస్ అధికారం లోకి రాగానే ఉచితంగా ఎల్‌ఆర్‌ఎస్ అమలు చేస్తామని చెప్పడం జరిగిందన్నారు. ప్రజల దగ్గర నుంచి ఎలాంటి చార్జీలు వసూలు చేయకుండానే రెగ్యులరైజ్ చేస్తామని హామీకి కట్టుబడి ఉండాలన్నారు. ఎన్నికల ముందు చెప్పిన మాటలను కాంగ్రెస్ నేతలు ప్రస్తుతం మంత్రులుగా ఉన్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కరెంట్ కోతలు మొదలయ్యాయని అన్నారు. రైతులు నీళ్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆరుగ్యారెంటీలు అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టడమే కాకుండా ఫ్రీబస్సులు పెట్టి ఎక్కువ బస్సులు నడుపకుండా మహిళల మధ్య గొడవలకు దారి తీస్తోందన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోని ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగా చేయాలని లేని పక్షంలో ఈనెల 7న జిల్లా కలెక్టరేట్, ఆర్డీవోలకు వినతి పత్రాలను అందజేస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ బాజిరెడ్డిజగన్, పార్టీ నగర అధ్యక్షుడు సిర్పరాజు, మురళి, మీర్‌మజాజ్‌అలీ, ప్రభాకర్‌రెడ్డి, దండుశేఖర్, సుజీత్‌సింగ్ ఠాకూర్, ప్రకాష్, సూదంరవిచందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



సమీక్ష నిర్వహిస్తున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావ్

ఖిల్లా,మార్చి 6:ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని సంబంధిత శాఖాధికారికి జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారివిఠల్‌రావ్, ఇందల్‌వాయి సభ్యురాలు గడ్డంసుమనరెడ్డిలు అన్నారు. ఇందల్‌వాయి ప్రాంతంలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వారికి చికిత్సలు అందించేందుకు 24గంటలు పీహెచ్‌సిలో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఇందల్‌వాయి సభ్యురాలు గడ్డంసుమనరెడ్డి సభకు తెలిపారు. అధికారులకు కాల్ చేయగానే వెంటనే స్పందించాలని తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశపుహాల్‌లో బుధవారం స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని నలుమూలల నుంచి పేద రోగులు రావడం జరుగుతుందని, వారికి మెరుగైన సేవలందించేందుకు కృషి చేయాలన్నారు. సంబంధిత వైద్యులకు ఎప్పటికప్పుడు సూచనలు జారీ చేయాలన్నారు. పాఠశాలలో విద్యార్థులలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని మధ్యాహ్న భోజన పథకంను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. పదో తరగతిలో ప్రభుత్వ పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత పెంచే విధంగా తగు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖాధికారికి ఆదేశించారు.డ్రగ్స్‌శాఖ వారు కూడా విధిగా తనిఖీలు నిర్వహించాలని సరైన ధరలకు మందులు విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.రోగ నిర్ధారణ కోసం రక్త నమునాలను జిల్లా కేంద్రానికి త్వరగా పంపాలన్నారు. రిపోర్టులు వెంటనే పీహెచ్‌సీలకు చేరేలా చర్యలు తీసుకోవాలని వైద్యఆరోగ్యశాఖాధికారులకు తెలిపారు.మందుల దుకాణాల లైసెన్సులను తనిఖీ చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీల్లో గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలనువారికి అందే విధంగా కృషి చేయాలని సూచించారు. బాల్య వివాహాలు అరికట్టాలని సీడీపీవోలు ఎప్పటి కప్పుడు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షల్లో సభ్యులు గంగాధర్, దాసరి లావణ్య, జడ్పీ సీఈవో ఉషా, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైతు నేస్తాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి

ఆర్మూర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. బుధవారం రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం చేస్తూ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి రైతు నేస్తం పేరిట వర్చువల్‌గా ప్రారంభించిన కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ చైర్మన్, వివిధ శాఖల అధికారులతో కలిసి హాజరై వీడియో కాన్ఫరెన్స్‌ను తిలకించారు.ఉప ముఖ్యమంత్రి బట్టివిక్రమర్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సందేశాలను ఆసక్తిగా విన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి చక్రవర్తి తరుణ్, హర్టికల్చర్ అధికారి నర్సింగ్‌దాస్, ఎంపీడీవో సాయిరాం, ఏవో హరికృష్ణ, ఎంపీవో శ్రీనివాస్, వ్యవసాయ, అనుబంధాల శాఖల అధికారులు పాల్గొన్నారు.



రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న జడ్పీచైర్మన్

రైతులతో వ్యవసాయ శాస్త్రవేత్తల వీడియో కాన్ఫరెన్స్



వీసీలో రైతులతో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి



వీసీలో ఉపముఖ్యమంత్రితో మాట్లాడుతున్న ఉత్తమ రైతులు

ముప్కాల్, మార్చి6: వ్యవసాయ నూతన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతుల మధ్య అనుసంధానికి వీడియో కాల్స్ విధానాన్ని బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గంలోని 110 రైతు వేదికల ద్వారా ప్రతీ సమాచారం రైతులకు అందుబాటులోకి తెచ్చింది. బుధవారం ముప్కాల్ మండల కేంద్రంలో బాల్కొండ నియోజకవర్గ స్థాయి రైతు సమావేశాన్ని రైతు వేదికలో నిర్వహించారు. అందులో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఉపముఖ్యమంత్రితో నేరుగా ఆదర్శ రైతులు తాము పండిస్తున్న పంట విధానాల గురించి అనుభవాలను వివరించారు. అదే విధంగా ఉత్తమ రైతులు రైతు క్షేత్రం నుంచి శాస్త్రవేత్తలతో మాట్లాడి సాగు చీడపీడల తెగులు వాటి పరిష్కారం మార్గాలు తెలుసు కున్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఒక రైతు సాఫ్ట్‌వేర్‌ను వదిలి సేంద్రీయ వ్యవసాయం చేసి మిర్చి పంటను పండించి దానిని పొడిగా చేసి ప్యాకెట్ల ద్వారా దేశంలోనే కాగా విదేశాల్లో సైతం మార్కెటింగ్ చేసి మంచి లాభాలు పొందుతున్నట్టు తెలిపారు. రైతులు ఒకే పంటను పండించకుండా పంట మార్పిడి ద్వారా, పాడిపరిశ్రమ, కోళ్ల పెంపకం, ఉద్యాన పంటలు మార్కెట్ ధరల గురించి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్రంలోని రైతులందరు తెలుసుకోవడం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈవీడియో కాన్ఫరెన్స్ విధానం వారంలో ప్రతీ మంగళ వారం, శుక్రవారం శాస్త్రవేత్తల చర్చగోష్టి ఉంటాయని దీని ద్వారా రైతులు నేరుగా వచ్చే మార్కెటింగ్ సమస్యలు, సస్యరక్షణ శాస్త్రవేత్తలతో సమాధానాలు, సూచనలు ఉంటాయని వీడియో కాన్ఫరెన్స్ ఉపముఖ్య మంత్రి బట్టివిక్రమార్క రైతులకు సూచిం చారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో నోడల్ ఆఫీసర్ సాయాగౌడ్, ఏడీఏ మల్లయ్య, వెటర్నరీ ఏడీ భరత్, మండల వ్యవసాయాధికారులు రాజ్ కుమార్, మహేందర్, మాలిక్, నర్సయ్య, ఏఈవో నిశికాంత్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మగ్గిడి ముత్యంరెడ్డి, కిసాన్ అధ్యక్షుడు బద్దం సాగర్, కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్య క్షుడు ఏలేటి మల్లారెడ్డి, డీసీసీ డెలిగేట్ చందరవి, సొసైటీ డైరెక్టర్ ఏలేటి రాములు, ఏలేటి విజయ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆర్మూర్ మున్సిపల్ చైర్మన్‌గా షేక్‌మున్నాకు బాధ్యతలు

ఆర్మూర్‌టౌన్, మార్చి6: ఆర్మూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్‌మున్నాకు ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించినట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దాన కిశోర్ ఉత్తర్వులో తెలిపారు. బుధవారం వెలువడించిన ఉత్తర్వుల్లో మార్చి నెలలో మున్సిపల్ బడ్జెట్ సమావేశం నిర్వహించాలని అందుకు గాను ఇన్‌చార్జి బాధ్యతలను షేక్ మున్నాకు అప్పగించినట్టు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై జనవరి 4న అవిశ్వాస పరీక్ష నిర్వహించడంతో అధికారులు అవిశ్వాస పరీక్ష నెగ్గిందని తెలిపారు. దీంతో పండిత్ వినీత అవిశ్వాస పరీక్ష వీగిందని, 2/3 సభ్యులు ఓటు వేయలేదని హైకోర్టును ఆశ్రయించగా తన కేసును కోర్టు కొట్టివేసింది. జరిగిన పరిణామాల దృష్ట్యా ఇప్పటి వరకు చైర్‌పర్సన్ ఎన్నికకు మార్గం సుగమం కాలేదు. ఫిబ్రవరిలో జరగాల్సిన బడ్జెట్ సమావేశం ఆలస్యం అవుతుండడంతో అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుంది. బడ్జెట్ సమా వేశం ఏర్పాటు చేయడానికి ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగించడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పలు పాఠశాలల్లో సైన్స్ ప్రదర్శనలు

నిజామాబాద్‌అర్బన్,మార్చి 6: నగరంలోని పలు పాఠశాలల్లో బుధవారం సైన్స్ ప్రదర్శనలు జరిగాయి. నగరంలోని వినాయక్‌నగర్‌లో గల ది పాఠశాల స్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఫేర్ ఆకట్టుకుంది. పాఠశాలకు చెందిన వివిధ తరగతుల విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలు ఆలోచింప చేశారు. ప్రతీ సంవత్సరం విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ శ్రీనివాస్, డైరెక్టర్ మధుమితలు తెలిపారు. నగర శివారులోని నవ్యభారతి గ్లోబల్ పాఠశాలలో బుధవారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన అట్టహాసంగా జరిగింది. ఈ ప్రదర్శనను పాఠశాల చైర్మన్ సంతోష్‌కుమార్, ప్రిన్సిపల్ శ్రీదేవీలు ప్రారంభించారు. సోలార్ సిస్టం, మ్యాథమెట్రిక్స్‌టిక్స్, వైజ్ఞానిక శాస్త్ర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రెండు రోజుల పాటు ఈ ప్ర దర్శన జరుగనుందని నిర్వాహకులు తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపిన ఒకరికి జైలు శిక్ష

ఖిల్లా,మార్చి6:మద్యం తాగి వాహనాలను నడిపే వారిని ట్రాఫిక్ పోలీసులు అదుపులోకి తీసుకుని వారికి బుధవారం కోర్టు ఎదుట హాజరు పరిచారు. వీరికి ట్రాఫిక్‌ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ కౌన్సె లింగ్ నిర్వహించగా కోర్టు వారికి రూ. 6100లు జరిమాన విధించింది. వీరిలో మెజిస్ట్రేట్ సయ్యద్‌ఖదీర్ ఎదుట హాజరు పరుచగా ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకట నారాయణ తెలిపారు.

తెరుచుకున్న మాధవనగర్ రైల్వే గేటు



మాధవనగర్ రైల్వే గేటు తెరిచిన దృశ్యం

డిచ్‌పల్లి, మార్చి 6:బర్డిపూర్ శివారులో గల మాధవనగర్ రైల్వే బుధ వారం సాయంత్రం ఎట్టకేలకుతెరుచుకుంది. ఆర్వోబీ పనుల కారణంగా 50రోజుల కింద ఈ మార్గం తాత్కలికంగా మూసివేసిన విషయం తెలిసిందే. తాత్కలికంగా అప్రోచ్‌రోడ్డు పూర్తిచేసిన అనంతరం గేట్లుతెరిచారు.సా యంత్ర నుంచి వాహనాలు రాకపోకాలు ప్రారంభమయ్యాయి. ఎట్టకేలకు మాధవనగర్ రైల్వేగేటు తీయడంతో వాహనదారులు హర్షంవ్యక్తం చేస్తున్నారు.

వంతెన నిర్మాణానికి శంకుస్థాపన

సిరికొండ,మార్చి6 :మండలంలోని నర్సింగ్‌పల్లి, రాంసింగ్‌తండా, మహిపాల్‌తండాలకు వెళ్లే మార్గంలో వంతెన నిర్మాణానికి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి బుధవారం రాత్రి శంకుస్థాపన చేశారు. నర్సింగ్‌పల్లితండా వంతెన నిర్మాణానికి రూ.1కోటి 24లక్షలు, రాంసింగ్‌తండా వంతెన నిర్మాణానికి రూ.1కోటి 93లక్షలు,మహిపాల్ తండాకు వెళ్లే వంతెనకు రూ. కోటి 20లక్షల నిధులు మంజూరు అయినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వీటిని నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికకల్లో ఇచ్చిన ఆరుగ్యారెంటీల్లో అమలు చేస్తున్నామని ఎమ్మెల్యేఅన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రవి, ఎర్రన్న, ముత్తన్న, బాల్‌రాజ్‌నాయక్, మాజీ సర్పంచు లు, ఎంపీటీసీ సభ్యులు వివిధగ్రామాలకు చెందిన కార్యకర్తలు పాల్గొ న్నారు.

నేడు ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కుల పంపిణీ

ధర్పల్లి: మండల కేంద్రంలో గురువారం ధర్పల్లి, సిరికొండ, ఇందల్వాయి మండలాలకు చెందిన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను నిజామాబాద్ రూరల ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేస్తున్నట్టు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాల్‌రాజ్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం గ్రామంలో గురడిరెడ్డి కల్యాణ మండపంలో చెక్కులను పంపిణీ చేయనున్నట్టు ఆయన చెప్పారు. అనంతరం జరిగే కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని అన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సైబర్‌క్రైం డీఎస్పీ

ఆర్మూర్‌టౌన్ , మార్చి6: పట్టణంలోనిసాంఘిక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు ఆన్‌లైన్ మోసాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్‌క్రైం డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్‌హెచ్‌వో రవికుమార్‌లు మాట్లాడుతూ సైబర్ క్రైంలపై వివరించారు. ఇటీవల పలువురు మోసపోయిన సందర్భాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా సైబర్ క్రైంలకు మోసపోతే వెంటనే 1930కు కాల్ చేయాలని, సైబర్‌క్రైం వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం ఇటీవల జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడల్లో క్యాప్టెన్‌గా వ్యవహరించి బంగారు పతకం సాధించిన అజ్మీర ఇందును శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్ర మంలో ఎస్సై ప్రవళిక, ప్రిన్సిపాల్ ధన వేణి, వైస్‌ప్రిన్సిపాల్ శరణ్య, ఉపా ధ్యాయ బృందం, విద్యార్థినిలు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో చోరీ

బోధన్ రూరల్, మార్చి 6: బోధన్‌లోని మండలంలోని సంగెం గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. దుండగలు గర్భగుడి తలుపులు పగులగొట్టి గొట్టివెంటి, శఠగోపం, హుండీని ధ్వంసం చేసి నగదుతో పాటు అమ్మవారి ఆభరణాలను ఎత్తుకెళ్లారని గ్రామస్థులు, భక్తులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసు ఘటన స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. భక్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామని, సీసీ కెమెరాల ఆధారంగా త్వరలోనే దొంగలు పట్టుకుంటామని బోధన్ ఎస్సై నాగ్‌నాథ్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవీపేట,మార్చి6: మండలంలోని బినోలకు చెందిన అయిటి గంగారాం(60)అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. అనారోగ్య సమస్యలతో ఈ నెల 1న తన ఇంట్లో గడ్డి మందును తాగగా వెంటనే అతనిని 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని ఆయన తెలిపారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడని అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

వర్ని,మార్చి6: వర్ని నుంచి నిజామాబాద్ వైపు వెళ్లే రోడ్డులో 35 నుంచి 45సంవత్సరాల లోపు గల మగ మృతదేహం మంగళవారం రాత్రి లభ్యమైనట్లు వర్ని ఎస్ఐ కృష్ణ కుమార్ తెలిపారు. మృతదేహన్ని బోధన్ ఆసుపత్రిలో భద్రపర్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు 8712659877 నెంబర్‌కు తెలిజేయాలన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.140	రూ.215	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.145	రూ.220	రూ. 250

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.65,000	రూ.60,000	రూ.760

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఆపరేషన్ వాలెంటైన్ (11.00, 1.55, 4.50, 7.45, 10.40)
స్క్రీన్-2 : దునే పార్ట్-2 (ఇంగ్లీష్) (10.05)
: చారి 111 (1.35, 10.10)
: వ్యూహం (4.25)
: భూతద్దం భాస్కర్ నారాయణ (7.10)
స్క్రీన్-3 : భూతద్దం భాస్కర్ నారాయణ (12.10)
: దునే పార్ట్-2 (ఇంగ్లీష్) (3.10, 6.40, 10.10)
స్క్రీన్-4 : ఇంటి నెంబర్-13 (1.05)
: కిక్ (3.50)
: ఆర్టికల్ 370 (హిందీ) (7.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : వ్యూహం (10.55)
: ఊరుపేరు భైరవకోన (1.30)
: సమరసింహారెడ్డి (4.30)
: ఆపరేషన్ వాలెంటైన్ (7.30, 10.30)
స్క్రీన్-2 : చారి 111 (11.00)
: హనుమాన్ (1.30, 4.30)
: వ్యూహం (7.30)
: కిక్ (10.30)
స్క్రీన్-3 : మా ఊరి రాజారెడ్డి (10.30)
: ఆపరేషన్ వాలెంటైన్ (1.30)
: భూతద్దం భాస్కర్ నారాయణ (4.20, 10.20)
: ఊరుపేరు భైరవకోన (7.20)

దేవి : ఆపరేషన్ వాలెంటైన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహాల్ : సమరసింహారెడ్డి (11.00, 9.15)
: కిక్ (2.15, 6.15)
నటరాజ్ : ఇంటి నెంబర్-13 (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : ఊరుపేరు భైరవకోన (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్